భూమి గాయబ్..?


ప్రైమ్‌లాండ్ వెంచర్‌లో డిలీటెడ్ స్థలంగా చూపించిన భూమి

- రూ.కోట్ల విలువైన సీలింగ్ భూమి ఎక్కడ?
- నర్సరీని మాయం చేసిందెవరు..?
- అధికారులు, నాయకుల పాత్ర ఎంత?
- ఉన్నతాధికారులు స్పందించాలి..
- చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో ప్రైమ్ లాండ్ పేరుతో 2004లో 45 ఎకరాల్లో వెంచర్ చేశారు. అప్పట్లో వెంచర్ అనుమతి కోసం హెచ్ఎండీఏను కోరగా సర్వే నంబర్ 127/బిలో 1.39 ఎకరాల ప్రభుత్వం భూమి ఉందని నిరాకరించారు. 9,560 గజాల ప్రభుత్వ భూమిని డిలీటెడ్ ల్యాండ్‌గా మ్యాప్‌లో చూపించి అనుమతి ఇచ్చారు. 2020లో అప్పటి కమిషనర్ డిలీటెడ్ స్థలంలో రూ.22 లక్షలతో నర్సరీ ఏర్పాటు చేసి రెండు బోర్లు వేసి మొక్కలు పెంచుతున్నారు. కానీ ఉన్నట్టుండి నాలుగు రోజుల క్రితం నర్సరీ మాయమైంది. నర్సరీ గేటుపై కొత్తగా కందకట్ల మాధవరెడ్డి, అతడి సెల్‌నంబర్ రాసి ఉంది. తొలగించిన బోర్డును అదే వెంచర్‌లో పార్కు కోసం వదిలిపెట్టిన 8,216 గజాల మరో స్థలంలో కొందరు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అక్కడ ముళ్ల కంపలు తప్ప ఏమీలేవు. పక్షం రోజులుగా పార్కు స్థలంలో పనులు జరుగుతుంటే అధికారులు, పాలకవర్గ సభ్యులు స్పందించపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నర్సరీ మాయంపై అధికారులు, రాజకీయ నాయకుల హస్తం ఉన్నట్లు ప్రజలు అనుమానిస్తున్నారు.

రూ.20 కోట్ల భూమి ఏమైనట్లు..?

ప్రైమ్ లాండ్ వెంచర్ అనుమతి కోసం వెళ్లగా సర్వే నంబర్ 127/బి దళిత సామాజిక వర్గానికి చెందిన యర్ర మైసయ్య పేరుపై 1.39 ఎకరాల సీలింగ్ భూమి ఉందని వెంచర్ అనుమతి నిరాకరించి 9,560 గజాల సీలింగ్ భూమిని 'డిలీటెడ్ లాండ్'గా చూపించి అనుమతిచ్చారని సమాచారం. దీంతో రెవెన్యూ అధికారుల రిపోర్టు మేరకు నర్సరీ ఏర్పాటు చేశారు. కానీ ప్రైవేటు వ్యక్తి తన భూమి అని కబ్జా చేయడంతో సీలింగ్ భూమి ఎక్కడుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాగా వెంచర్ చేసిన వ్యక్తి మరణించగానే డిలీటెడ్ స్థలాన్ని కొనుగోలు చేశానని ఓ ప్రైవేటు వ్యక్తి నర్సరీ తొలగించి భూమిని స్వాధీనం చేసుకోవడం గమనార్హం. ప్రైవేటు వ్యక్తి పార్కు స్థలంలో పనులు చేయిస్తుంటే మున్సిపల్ అధికారులు, పాలకవర్గ సభ్యులు ఏమి చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కుంభకోణంలో ఉన్నదెవరు..?

మున్సిపాలిటీకి చెందిన జేసీబీతోనే నర్సరీని తొలగించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నర్సరీ మాయం చేసిన వ్యక్తి మున్సిపల్ కార్యాలయంలో ఇప్పటి వరకు దస్తావేజులు సమర్పించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. డిలీటెడ్ స్థలాన్ని అప్పగించడానికి 25 శాతం భూమిని తనకివ్వాలని ఓ ప్రముఖ నాయకుడు అన్నోజీగూడలోని తులిప్స్ హోటల్‌లో చర్చలు జరిపాడని, తన దగ్గర సాక్ష్యాలు ఉన్నాయని, సదరు ప్రైవేటు వ్యక్తి ప్రచారం చేసుకుంటున్నాడు. కానీ కొనుగోలు చేసిన దస్తావేజులు ఇవ్వాలని తహసీల్దార్ కోరగా ఇవ్వడానికి దాటవేస్తున్నాడు.


నర్సరీ గేటును తొలగించింది అధికారులు, పాలకవర్గమేనని ప్రజలు ఆరోపిస్తున్న మున్సిపాలిటీ జేసీబీ

అన్నీ అనుమానాలే..

నర్సరీని ఎవరు మాయం చేశారు? కమాన్‌ను తొలగించింది ఎవరు? గేటుపై పేరు రాయించుకున్నది ఎవరు? పార్కు స్థలంలో బోర్డును పాతించింది ఎవరు? నాయకుడు ఎవరు, వారు చేసుకున్న ఒప్పందం ఏమిటో, విచారణ జరిపి భూకుంభకోణం నిజనిజాలు బయట పెట్టాలని మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు.

రికార్డులు తెప్పించి చర్యలు తీసుకుంటాం..



డిలీటెడ్ స్థలం ప్రభుత్వానిదా ప్రైవేటుదా..? తెలుసుకుంటాం. వెంచర్ అనుమతి పత్రాలు, మ్యాప్ కోసం, స్థలం ఎవరిది అనేది తేలడానికి రికార్డుల కోసం రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారులకు లేఖలు పంపాం. వారి రిపోర్టు అందగానే చర్యలు తీసుకుంటాం.

– ఎండీ సాబేర్ అలీ, కమిషనర్ ఘట్‌కేసర్ మున్సిపాలిటీ

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న యువకులు

మేడ్చల్‌రూరల్: మండలంలోని రాజబొల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఘనాపూర్ గ్రామ యువకులు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అండగా నిలిచారు. ఘనాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 30 మంది పదో తరగతి విద్యార్థులకు రూ.10 వేల విలువ గల ఆల్ ఇన్ వన్, స్టడీ మెటీరియల్‌ను పూర్వ విద్యార్థి కిరణ్, గ్రామ యువకులు భాస్కర్, ఉపేందర్, వినోద్, మనోహర్, శ్రీనాథ్, కిట్టు ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు అందజేశారు. మంచి మార్కులు సాధించి పాఠశాలకు, గ్రామానికి పేరు తీసుకురావాలని కోరారు.

ఆర్టీసీ ఉత్తమ ఉద్యోగులకు సన్మానం



మేడ్చల్: జనవరి నెలలో ఉత్తమ సేవలందించిన మేడ్చల్ ఆర్టీసీ డిపో అత్యధిక ఇన్సెంటివ్ సాధించిన కండక్టర్లను, ఇంధన పొదుపు చేసిన డ్రైవర్లను, బ్రేక్ డౌన్ లేకుండా మెయింటెనెన్స్ చేసిన మెకానిక్‌లను అధికారులు సన్మానించారు. మేడ్చల్ డిపోలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో డీఎం సుధాకర్, అధికారులు కండక్టర్లను, డ్రైవర్లను సన్మానించి పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రతినెలా ఇంధనం పొదుపు చేసి డ్రైవర్లు, అత్యధిక ఇన్సెంటివ్ సాధించిన కండక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డీఎం రామారావు, సూపరింటెండెంట్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఈటల రాజేందర్

మేడ్చల్‌రూరల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని జీడిమెట్లలో నాలుగు రోజుల పాటు జరిగిన ఈటల ఫర్ మల్కాజిగిరి క్రికెట్ టోర్నీ విజేతలకు గురువారం మాజీ మంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్ నగదు బహుమతితో పాటు ట్రోఫీలను అందజేశారు. మేడ్చల్ మండలం పూడూర్ గ్రామ పరిధిలోని తన నివాసంలో నిర్వాహకులతో కలిసి టోర్నీ విజేత జట్టుకు రూ.లక్ష చెక్కు, రన్నర్ జట్టుకు రూ.30 వేల చెక్కుతో పాటు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

చీర్యాలలో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కీసర: చీర్యాల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో గంగా భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామివారి ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా నాల్గో రోజైన గురువారం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఉదయం దేవాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. చీర్యాల లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వేదపండితులు లక్ష్మారెడ్డికి స్వామివారి ఆశీర్వచనంతో పాటు మహాప్రసాదాన్ని అందజేయగా ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్ స్వామివారి చిత్రపటాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సతీమణి పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

న్యూలిటిల్ లిల్లీ స్కూల్ వార్షికోత్సవం



మేడ్చల్: పట్టణంలోని న్యూలిటిల్ లిల్లీ స్కూల్ వార్షికోత్సవాన్ని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ మంజుల ప్రకాష్, బలగం సినిమా ఫేమ్ కొమురయ్య(సుధాకర్‌రెడ్డి), ఎంఈఓ వసంతకుమారి పాల్గొన్నారు.

చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం

ఘట్‌కేసర్: మర్పల్లిగూడ బీరప్ప ఆలయం వద్ద ఎదులాబాద్ చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గురువారం ఉదయం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎదులాబాద్ శ్రీలక్ష్మీనారాయణ చెరువులో మర్పల్లిగూడ బీరప్ప ఆలయం వద్ద గుర్తు తెలియని మృతదేహం తేలియాడుతుందనే స్థానికుల సమాచారం మేరకు ఘట్‌కేసర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా వ్యక్తి వయస్సు 35–40 వయస్సు, ముస్లిం వ్యక్తిగా తెలిసింది. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు


వికాస్ కుమార్

పోచారం: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోచారం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ బి.రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన వికాస్ కుమార్(24) నారపల్లిలోని వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తూ గంజాయికి బానిసై ప్లాంట్‌లో పనిచేయడం మానేశాడు. ఆర్థిక స్తోమత క్షీణించడంతో బీహార్‌లోని శరణ్య నుంచి గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్రయించడం మొదలు పెట్టాడు. కొర్రెముల చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతూ గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బ్యాగులో 200 గ్రాముల గంజాయి లభించింది. నిందితుడిని అరెస్ట్ చేసి గంజాయితో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

సభదృష్టికి పలు సమస్యలు


మూడుచింతలపల్లి మండల సర్వసభ్య సమావేశం

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండల సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం మండల కేంద్రంలో ఎంపీపీ హారిక అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు గ్రామాల్లోని పలు సమస్యలను సభాదృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా వేసవి కాలంలో మిషన్ భగీరథ నీరు గ్రామాల్లోకి సరిపడా రావడం లేదని, చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ దృష్టికి తీసుకువచ్చారు. డిమాండ్‌కు సరిపడా విద్యుత్‌ను రాబోయే వేసవి కాలంలో అందించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని విద్యుత్ అధికారులు సభా దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన జరుగుతున్న నేపథ్యంలో ప్రతి అధికారి అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ వత్సలదేవి సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, మిషన్ భగీరథ డీఈఓ అర్చన, సభ్యులు హన్మంత్‌రెడ్డి, అఖిలేష్‌రెడ్డి, కో ఆప్షన్ గౌస్‌పాషా, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నాం..

టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్


ఆలయ వార్షికోత్సవ ఆహ్వాన పత్రిక అందజేస్తున్న బాలాజీనగర్ యాదవ సంఘం సభ్యులు

జవహర్‌నగర్: ప్రజాపాలనలో రాష్ట్రంలోని ప్రజలకు మెరుగైన పాలన అందజేస్తున్నామని టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని వరాల మల్లన్న ఆలయ వార్షికోత్సవానికి రావాలని కోరుతూ బాలాజీనగర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ సమక్షంలో గురువారం తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఆహ్వానపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, బాలాజీనగర్ యాదవ సంఘం అధ్యక్షులు అశోక్, ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, ఉపాధ్యక్షులు రామకృష్ణయాదవ్, రాజుయాదవ్, రమేష్‌యాదవ్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ


ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని అన్నానగర్‌లో శ్రీరేణుక ఎల్లమ్మ నల్లపోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని నిర్వాహకులకు సూచించారు. బీఆర్ఎస్ నాయకుడు సామల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, కౌన్సిలర్ మెట్టు బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ పోచారం మున్సిపల్ నాయకులు మందడి సురేందర్‌రెడ్డి, బద్దం జగన్మోహన్‌రెడ్డి, సామల యాదిరెడ్డి, సందీప్‌రెడ్డి, ఆకిటి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిధుల గోల్‌మాల్ నిధులకు వడ్డీ చెల్లించాలని ఉత్తర్వు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో ఆరు నెలల క్రితం రూ.3.13 కోట్ల ట్యాక్స్ నిధులు గోల్‌మాల్ అయ్యాయి. విషయం గమనించి నిధుల కుంభకోణంలో ప్రధాన కారణమైన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి హేమంత్‌పై చర్యలు తీసుకోవాలని ప్రస్తుత ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ సబేర్ అలీ స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పక్కదారి పట్టిన నిధులు రూ.3.13 కోట్లను అప్పటి అధికారులు ఎలాగోలా జమ చేశారు. ఫిర్యాదు మేరకు నిధుల గోల్‌మాల్ సమయంలో విధులు నిర్లక్ష్యం చేసిన ఇద్దరు కమిషర్లకు నోటీసులు జారీ చేసి ఇద్దరి మేనేజర్లను రాష్ట్ర మున్సిపల్ శాఖ అధికారులు సస్పెండ్ చేశారు. తాజాగా కుంభకోణం జరిగిన నిధులకు రూ.49 లక్షల వడ్డీ చెల్లించాలని రాష్ట్ర మున్సిపల్ శాఖాధికారులు స్థానిక మున్సిపల్ కార్యాలయానికి ఉత్తర్వులు జారీచేశారు.

బోడుప్పల్ వార్షిక బడ్జెట్ రూ.75.21 కోట్లు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ 2024–25 సంవత్సరం వార్షిక బడ్జెట్ రూ.75.21 కోట్లకు తీర్మానించింది. నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం మేయర్ సామల బుచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగిన అంచనా బడ్జెట్ సమావేశంలో పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ బడ్జెట్‌లో ఇంటి పన్నుల ద్వారా రూ.16 కోట్లు, పన్నుయేతర రాబడి రూ.41.70 కోట్లు, ఇతర గ్రాంట్లు కలుపుకుని మొత్తం రూ.75.21 కోట్లు రాబడి వస్తుందని అంచనా వేశారు. అలాగే అభివృద్ధి పనులు, జీతభత్యాలు, ఇతర ఖర్చులకు గాను రూ.72.38 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఇంకా రూ.2.83 కోట్లు మిగులు బడ్జెట్ ఉంటుందని తెలిపారు.

పాలకవర్గ సాధారణ సమావేశంలో..

బడ్జెట్ సమావేశం అనంతరం పాలకవర్గ సాధారణ సమావేశం నిర్వహించారు. పలు అభివృద్ధి పనులపై పాలకవర్గం చర్చించింది. అన్ని డివిజన్లలో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి పనుల కోసం రూ.7 కోట్లు ఖర్చు చేసేందుకు తీర్మానించింది. అందుకు పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అలాగే పెండింగ్ ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కార్పొరేటర్లు కోరారు. కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, మేనేజర్ నాగేంద్ర బాబు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈఎంఆర్ఐలో ఉద్యోగావకాశాలు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఈఎంఆర్ఐలో ఉద్యోగావకాశాలు ఉన్నాయని అర్హత, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ జనషద్ తెలిపారు. 108 వాహనాల్లో పైలెట్, ఈఎంటీలుగా పని చేసేందుకు 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు పాసై, 35 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న వారు మేడ్చల్ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న ఈఎంఆర్ఐ ఆఫీసుకు హాజరుకావాలని కోరారు.

సీఎంఆర్ఐటీ కళాశాల డైరెక్టర్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న సీఎంఆర్ఐటీ డైరెక్టర్ జంగారెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ఐటీ కళాశాల డైరెక్టర్ జంగారెడ్డికి ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డు దక్కింది. గురువారం నగరంలో నిర్వహించిన ఔట్‌లుక్ బిజినెస్ ఎడిటెక్ సమ్మిట్ కార్యక్రమంలో ఈ మేరకు సంస్థ ప్రతినిధులు జంగారెడ్డి గారికి అవార్డు అందజేశారు. అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. అవార్డు అందుకున్న డైరెక్టర్‌ను కళాశాల యాజమాన్యం అభినందించింది.

ఆస్తిపన్ను వడ్డీపై రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

మేడ్చల్: ప్రభుత్వం ఆస్తి పన్నుల వడ్డీపై 90శాతం రాయతీ ప్రకటించడంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఆస్తి పన్నులను చెల్లించాలని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్ రాములు వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనల్లో కోరారు. రెండు మున్సిపాలిటీల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ బకాయిలను చెల్లించాలని కమిషనర్లు కోరారు.

21వ వార్డులో కమిషనర్ పర్యటన


21వ వార్డులో డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ నాగిరెడ్డి

మేడ్చల్: పట్టణంలోని 21వ వార్డులో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి కౌన్సిలర్ కృష్ణవేణి రవీందర్ రెడ్డితో కలిసి పర్యటించారు. వార్డులో ఆయన పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. డ్రైనేజీ పనులు అవసరమని ఆయన గుర్తించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రవీందర్‌రెడ్డి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

3న ఉచిత వైద్య శిబిరం

గౌతంనగర్: సాయినగర్‌లోని సాయిబాబా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో గ్యాస్ట్రో, కంటి, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, ఆర్థో, పిడియాట్రిక్స్, గైనకాలజీ తదితర విభాగంలో పరీక్షలు చేస్తారని తెలిపారు. వివరాలకు ఫోన్: 8885018785, 040–40181288.

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం


మంత్రి కొండా సురేఖకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ నరేందర్ తదితరులు

కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 6వ తేదీ నుంచి 11 వరకు కొనసాగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ప్రత్యేక పూజలకు హాజరుకావాలని కోరుతూ గురువారం కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం ఆధ్వర్యంలో దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్టకు తరలివచ్చే యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ చైర్మన్‌తో పాటు ఈఓ నరేందర్‌ను ఆదేశించారు. ముఖ్యంగా సామాన్య భక్తులకు స్వామి దర్శనం వీలైనంత త్వరగా జరిగేవిధంగా క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓ నరేందర్, వంశపారంపర్య ధర్మకర్తలు తటాకం నారాయణ, తటాకం వెంకటేష్, పండితులు బల్‌రాంశర్మ, బన్నిశర్మ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు


సమీక్ష సమావేశంలో డీఆర్‌డీఏ అధికారి సాంబశివరావు తదితరులు

కీసర: హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణతో పాటు గ్రామాల్లో ఈసారి హరితహారంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలను నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు డీఆర్‌డీఏ జిల్లా అధికారి సాంబశివరావు అన్నారు. ఈమేరకు గురువారం కీసర మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గ్యామనాయక్, ఎంపీఓ వినూత్న రెడ్డి, గ్రామకార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వేసవిని దృష్టిలో ఉంచుకొని హరితహారంలో ఇదివరకే నాటిన మొక్కలకు నీటిని అందించి వాటిని కాపాడాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. అదేవిధంగా నర్సరీల్లో ఈ ఏడాది హరితహారం మొక్కల ఎలా పెంచాలో నిర్ణయించి అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అదేవిధంగా మండల పరిధిలో ఉపాధిహామీ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఐ శ్రీనివాస్, ఎస్సై శేఖర్ శేఖర్

ఘట్‌కేసర్: డ్రగ్స్ నివారణకు యువత ముందుకు రావాలని డీఐ శ్రీనివాస్ అన్నారు. అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో సమ్మర్ స్పెషల్ క్యాంపులో భాగంగా గురువారం ఘట్‌కేసర్‌లో డ్రగ్స్ నివారణ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ర్యాలీ యంనంపేట్ చౌరస్తా నుంచి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లు ప్లకార్డులు చేతబట్టి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం డీఐ మాట్లాడుతూ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలు, వ్యసనాలకు బానిస కావొద్దన్నారు. కార్యక్రమంలో ఎస్సై శేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు నవీన్, మధుకర్, శ్రీనివాస్‌రావు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన బాధ్యత అందరిది



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి

శామీర్‌పేట్: ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మూడుచింతలపల్లి మండల తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి అన్నారు. మండల పరిధిలోని జగ్గంగూడ గ్రామంలో గల గ్రామకంఠం భూమిలో గ్రామ అవసరాల నిమిత్తం క్రీడా మైదానం, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, బతుకమ్మ ఘాట్, ఔషధ మొక్కలను యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేశారు. కాగా గురువారం ఆ సంస్థ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశానికి హాజరైన తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి కృషి చేసిన యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు రెవెన్యూ శాఖ అధికారులు ఉన్నారని తెలిపారు. అనంతరం సంస్థ ప్రతినిధులను మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి సన్మానించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి మణి, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, మాజీ వార్డుసభ్యులు జహంగీర్, అనిల్‌రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.